విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాత

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మల్కాజ్‌గిరి నెరెడ్మెట్‌లోని సెయింట్ మార్క్స్ హైస్కూల్ కరస్పాండెంట్ మల్లికార్జున్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాలలో చదివే 65 మంది విద్యార్థులకు రూ.40 వేలు విలువ చేసే మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని రక్షించాలని ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న ముత్యాలుయాదవ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో సర్కారు భూములను సంరక్షించాలని కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ ఆర్డీఓ సైదులుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. కొండాపూర్‌లోని సర్వేనంబర్ 257లోని సర్కారు భూమి కబ్జాలకు గురైతుందని, ఆక్రమణలను నిలుపుదల చేయించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు దేవేందర్ ముదిరాజ్, చంద్రశేఖర్‌గుప్తా, ఆంజనేయులుయాదవ్ పాల్గొన్నారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టిన కారు



శామీర్‌పేట్: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటన తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి శామీర్‌పేట వైపు కరీంనగర్–హైదరాబాద్ రాజీవ్ రహదారి గుండా వస్తుండగా.. స్పోర్ట్స్ స్కూల్ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరితో పాటు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి.

వేతనాలు ఇవ్వండి



మేడ్చల్: పశువుల సంరక్షణ కోసం నిత్యం పని చేస్తున్న పశు సంచార వైద్య సిబ్బందికి నాలుగు నెలలుగా ఉన్న బకాయి వెంటనే ఇవ్వాలని మేడ్చల్ పశుసంచార వాహన సిబ్బంది కోరారు. నాలుగు నెలలుగా వేతనాలు లేక తాము ఇబ్బందులు పడుతున్నామని, తమకు వెంటనే జీతాలు ఇవ్వాలని యాజమాన్యంను కోరారు. ఈ మేరకు సిబ్బంది పశుసంచార వాహనం ఎదుట నిరసన తెలిపారు.

సోషల్ మీడియా పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి



మేడ్చల్: పాఠశాల స్థాయి, కళాశాల స్థాయి యువతులు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ ఏఎస్ఐ సాయి అన్నారు. పట్టణంలోని న్యూలిటిల్ లిల్లి స్కూల్‌లో షీటీమ్ ఆధ్వర్యంలో ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సాయి మాట్లాడుతూ.. వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేసుబుక్ తదితర సామాజి మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు తమ వ్యక్తి గత సమాచారాన్ని ఎవ్వరికి ఇవ్వొద్దని సూచించారు. మహిళలు, యువతులు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా 9490617444 నెంబర్‌కు వాట్సాప్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో పోలీస్‌సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం



మహీంద్రా షోరూంలో కేక్ కట్ చేస్తున్న రైతులు

మేడ్చల్: జాతీయ రైతు దినోత్సవంను మండలంలో వివిధ ప్రాంతాలలో రైతులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రధానంగా రైతులకు ట్రాక్టర్ల షోరూంల యజమానులు ఆహ్వానం పలికి కేక్‌లు కట్ చేసి రైతులను ఘనంగా సన్మానించారు. అత్వెల్లిలోని మహీంద్రా ట్రాక్టర్ షోరూంలో షోరూం సిబ్బంది, రైతులు ఈ వేడుకను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు రాంచందర్, షోరూం అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సన్మానం

మేడ్చల్‌రూరల్: జాతీయ రైతు దినోత్సవాన్ని మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్‌లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అయ్యప్ప ఆలయ ధర్మకర్త మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో నిర్వహించిన రైతు దినోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామంలో అధికంగా పంటల సాగు చేసే రైతులు మర్కంటి లింగం, బాసుపల్లి భూపాల్‌రెడ్డిలను శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, రవి, పవన్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలం, బొమ్మరాశిపేట సోమవారం కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే సబ్సిడీ ఋణాలపై రైతులకు బ్యాంక్ అధికారులు వివరించారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే భీమా పథకాలను బ్యాంకు అకౌంట్ కలిగి ఉన్న ప్రతీ వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా పథకం, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి రవి, మల్కాజ్గిరి జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులు లక్ష్మీకాంత్‌రెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ సాగర్, రైతులు పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు



సాక్షి,సిటీబ్యూరో: న్యాయమైన సమస్యల పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకున్నాయి. రోజుకో విధంగా వినూత్న పద్ధతిలో సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన దీక్షలను చేపడుతున్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డుపై వంటావార్పు నిర్వహించిన సమగ్ర శిక్షా ఉద్యోగులు సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే, క్రిస్మస్ వేడుకలను పురస్కమ్కరించుకుని, అయా వేషాదారణలతో ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించాలన్న రీతిలో పలు ప్రదర్శనలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధులు ఫణి, దేదివ్య, మల్లేష్‌తో సహ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

సాక్షి,సిటీబ్యూరో: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చర్యలకు నిరసనగా మంగళవారం తూముకుంటలోని అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యాక్షుడు, నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూరి వజ్రేష్ యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఏఐసీసీ పిలుపు మేరకు తూముకుంట నుంచి కలెక్టరేట్ వరకు నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు హరివర్ధన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు, పురపాలక సంఘాలు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల జిల్లా, మండల, పురపాలక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

దేశాన్ని అభివృద్ధి చేసిన ఆర్థిక సంస్కరణకర్త పీవీ



శామీర్‌పేట్: ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లిన మహనీయుడు మాజీ పీవీ నర్సింహారావు ప్రజలకు ఎంతో సేవచేశారని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు 20వ వర్ధంతి సందర్భంగా సోమవారం నగర శివారు తూముకుంట కాంగ్రెస్ ఆఫీసులో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. టీపీసీసీ ఉపాధ్యాక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూరి వజ్రేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది పురపాలక సంఘాలు, కీసర, ఘట్కేసర్, ఎంసీపల్లి, శామీర్‌పేట, మేడ్చల్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ సందర్భంగా మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు చిత్రపటానికి నివాళులర్పించారు.

సత్కారం



కీసర: నాగారం మున్సిపల్ బీజేపీ సీనియర్ నేత సత్యనారాయణను సోమవారం త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గత కొన్నేళ్లుగా బీజేపీ పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన సత్యనారాయణను కలుసుకోవడం సంతోషంగా ఉందని, తమ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నామని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి నాగారంకు విచ్చేసిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని ఘనంగా సత్కరించారు.

ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి



సాక్షి,సిటీబ్యూరో: వివిధ జిల్లా శాఖలలో ఆన్‌లైన్ పెండింగ్ అప్లికేషన్ల సంఖ్య పెరిగిపోతోందని, వాటిని సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులపై కూడా తక్షణమే స్పందించాలన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. వినతులపై చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 94 అర్జీలను ఇన్‌చార్జి డీఆర్‌ఓ శంకర్‌కుమార్‌తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

కీసర: కీసరలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కీసర బీజేపీ నేత నల్ల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. కీసరకు సుమారు 10 కిలోమీటర్ల మేర దూరంలో ఆధార్‌కేంద్రం ఉన్నందున్న ఆధార్‌లో ఏవైనా మార్పులు చేసుకునేందుకు కీసర వాసులకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. అంతేకాకుండా ఆధార్ కేంద్రానికి వెళ్లేందుకు రవాణా ఖర్చులతో పాటు, ఆధార్ సెంటర్‌లో అధిక ఫీజులు వసూళు చేస్తున్నారని, అధికారులు స్పందించి కీసరలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని థ్యాంక్స్ గివింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, కళాశాల సిబ్బంది బియ్యం, బట్టలు తదితర నిత్యావసర వస్తువులు వృద్ధాశ్రమాలకు, అనాథ పిల్లలకు విరాళాలుగా అందజేయనున్నట్లు కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, డైరెక్టర్ సరోజారెడ్డి తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని విద్యార్థులు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్ అధ్యక్షుడుగా హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో హరిప్రసాదరావు అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ప్రత్యర్థి భరత్‌పై ఒక్క ఓటు ఆధిక్యతతో హరిప్రసాదరావు విజయం సాధించారు. చెల్లని ఓట్లను చూపించకుండా ఎన్నికల కమిటీ పక్షపాత ధోరణితో వ్యవహరించిందని భరత్ ఆరోపిస్తున్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కాగా, హరిప్రసాదరావు మద్దతుతో కార్యవర్గ సభ్యులుగా పీ.వీ.సరిత, జీ.ఎస్.ప్రతిభ, ప్రగతి గెలిచారు. భరత్ మద్దతుతో ఉపాధ్యక్షుడుగా సత్యనారాయణ, కార్యదర్శిగా ఇందిరా ప్రియదర్శిని, కోశాధికారిగా కే.వీ.ఆర్.శశిధర్‌లాల్, కార్యవర్గ సభ్యులుగా రోహిత్‌రావు, అనిల్‌రెడ్డి, భానుప్రసాద్, దీపక్ నాయర్ గెలుపొందారు.

స్కూల్‌లో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



కీసర: ప్రకృతి ప్రసాదించిన సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా పండించిన కూరగాయాలను తింటే ఆరోగ్యం బాగుంటుందని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని ప్రిన్సిపాల్ పద్మజరావు అన్నారు. సోమవారం రాంపల్లి జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఎక్స్‌పీరియన్షల్ లెర్నింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రీప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో గల ఆర్గానిక్ గార్డెన్‌లో పండించిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పంటలను పండించే వ్యవసాయ క్షేత్రాలను ప్రత్యక్షంగా చూడడం ద్వారా విద్యార్థులకు పంటల సాగుపై సరైన అవగాహన కలుగుతుందన్నారు. విద్యార్థులు పంటలను పండించే విధానాలను డైరెక్ట్‌గా చూడడం ద్వారా వ్యవసాయంలో కష్టనష్టాలను తెలుసుకోవడంతోపాటు వ్యవసాయంపై అవగాహన కల్పించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొని విద్యార్థులచేత నిర్వహించబడిన కూరగాయల అంగడిలో కూరగాయలు కొనుగోలు చేసి సందడి చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

పోచారం: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పోచారంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కొండల్‌రెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి ఎంతో మందిని ఆదుకుంటుందని, ఏడుగురు లబ్ధిదారులకు చెక్కులు అందించామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్‌లోని విభా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జీఎస్టీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ దేవేందర్, మోటివేషనల్ స్పీకర్ వీవీ రమణ, మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు తమ సంస్కృతిక కార్యక్రమాలతో అందరిని ఆకట్టుకున్నారు. పలు విభాగాల్లోని ఉత్తమ విద్యార్థులకు మెడల్స్ ప్రధానం చేసి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి విష్ణుమూర్తి, డైరెక్టర్ విజయభారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫార్మాస్యూటికల్ సదస్సులో ఎన్ఎన్ఆర్‌జీ ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఎన్ఎన్ఆర్‌జీ డైరెక్టర్ డాక్టర్ కృష్ణారెడ్డి

పోచారం: అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి ఫార్మాస్యూటికల్ సేకరణ సదస్సులో చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఫార్మసీ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. నగరంలోని బ్రిలియంట్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో జరిగిన ఈ సదస్సులో మౌఖిక, పోస్టర్ ప్రజెంటేషన్స్ సమర్పించి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందుకున్నారు. మానవ శరీరంలో మైక్రోప్లాస్టిక్స్, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై ఇచ్చిన ప్రజెంటేషన్స్ ఆసక్తికరంగా ఉండటంతో విజయం వరించింది. విజేతలను కళాశాల డైరెక్టర్ డా. సీవీ కృష్ణారెడ్డి, డీన్ డా. కృష్ణ మోహన్, అధ్యాపక బృందం సోమవారం అభినందించారు.

రైల్వే వంతెన భూ బాధితులతో ఆర్డీఓ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సైదులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణానికి భూములు ఇస్తున్న బాధితులతో కీసర ఆర్డీఓ సైదులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. 2013 నూతన చట్టం అనుసరించి మూడింతల నష్టపరిహారం, లేదంటే గజానికి రూ. 30 వేలు ఇవ్వాలని, 60 గజాల ప్లాటు, ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని బాధితులు కోరారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. 102 మంది బాధితుల్లో 25 మంది గతంలోనే నష్టపరిహారం తీసుకున్నారని, మిగిలిన వారికి కూడా నష్టపరిహారం లభిస్తుందన్నారు. పరిహారం పెంచే హక్కు మాకు లేదని, మిగిలిన వారికి కూడా గతంలో బాధితులు తీసుకున్న నష్టపరిహారమే వర్తిస్తుందన్నారు. తీసుకొనని బాధితుల నష్టపరిహారం 2015లో కోర్టులో జమా చేశామని, ప్రస్తుతం కోర్టు ద్వారా నష్టపరిహారం పొందవచ్చని అన్నారు. కోర్టులో జమాగా ఉన్న నష్టపరిహారం లాయర్ల ద్వారా తీసుకోవచ్చన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య మాట్లాడుతూ.. నష్టపరిహారం, ఇళ్ల కేటాయింపుపై బాధితుల పక్షాన ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్‌తో మాట్లాడేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు అనురాధా, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, మల్లేష్, రవీందర్, జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, నాయబ్ తహసీల్దార్లు భాస్కర్‌రెడ్డి, రాజేందర్, బాధితులు రాఘవరెడ్డి, దేవేందర్‌ముదిరాజ్, శివప్రదీప్‌రెడ్డి, అరుణ్‌ముదిరాజ్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్‌గుప్తా పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం



ముగింపు వేడుకల్లో ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడుతాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డు పరిధి నైబర్‌హుడ్ కమ్యూనిటీలో 45 రోజుల పాటు సాగిన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, బీజేపీ మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు అమరం సరస్వతి, మల్లిఖార్జున్ ముదిరాజ్, నాయకులు వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, పాపారావు, జయప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవం



సమావేశంలో సింగరేణి విశ్రాంత కార్మికులు

పోచారం: సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో కొర్రెములలోని సుప్రభాత్ టౌన్‌షిప్ ఆవరణలో 136వ సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అసోసియేషన్ ఉపప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాట్లాడుతూ.. దాదాపు 40 ఏళ్లు దేశానికి వెలుగు నిచ్చిన రిటైర్ట్ కార్మికులకు తగిన పెన్షన్‌తో పాటు వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. బొగ్గు యాజమాన్యం, ప్రభుత్వాలు ఏకాభిప్రాయానికి వచ్చి కనీస పెన్షన్‌ను రూ. 15 వేలకు పెంచాలని కోరారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది విశ్రాంత కార్మికులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కార్మికుడు బుచ్చిరెడ్డికి భీష్మ అవార్డు ప్రకటించి సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బానయ్య, ఉపాధ్యక్షుడు బంగారి రాజయ్య, కార్యదర్శులు నర్సింగ్‌రావు, కనకయ్య, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకై భూ సేకరణ పరిశీలన

శామీర్‌పేట్: ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు విస్తరణకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను సోమవారం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పరిశీలించారు. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌కు రోడ్డు విస్తరణలో భాగంగా అల్వాల్, తూంకుంట మున్సిపాలిటీలో స్థల సేకరణ మార్కింగ్‌లను డీఆర్‌ఓ శంకర్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. నిర్మాణాలు కోల్పోతున్న వారి ఇంటి డాక్యుమెంట్‌లు, రేషన్ కార్డులు, ఆధార్, ఓటర్ కార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ అందలేదు



ఘట్‌కేసర్: ఇచ్చిన హామీ అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని, రైతులందరికీ రుణమాఫీ అందలేదని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. జాతీయ రైతు దినోత్సవం పురస్కరించుకొని ఘట్‌కేసర్‌లో సోమవారం ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం 10–20 శాతం మందికి మాత్రమే రుణమాఫీ అయిందని, ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో 1200 మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ పోచిరెడ్డి, నాయకులు కరుణాకర్, మహిపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సదానంద్‌రెడ్డి, రైతులు బాలరాజ్‌యాదవ్, నర్సింహాయాదవ్, లక్ష్మణ్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం

విద్యార్థుల్లో పెంపొందించాలి



ఘట్‌కేసర్: పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం విద్యార్థుల్లో పెంపొందించాలని టాస్క్ ప్రోగ్రామ్ మేనేజర్ ప్రదీప్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని కొండాపూర్ సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మల్టీనేషనల్ కంపెనీ స్యాప్ ల్యాబ్స్ ఇండియా ప్రాజెక్ట్‌లో భాగంగా ఎడ్యూనెట్ ఫౌండేషన్, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)తో కలిసి కోడ్ ఉన్నతి (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్‌లో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు.

కార్యక్రమంలో టాస్క్ రిలేషన్ మేనేజర్ నరేష్, ఎడ్యూనెట్ ప్రాగ్రామ్ మేనేజర్ శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ జానకీరాములు, శివ కేశవరెడ్డి, డాక్టర్ శశిధర్, పోతిరెడ్డి, నీలంసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.